సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 23 । మార్చి । 2025



ఆస్తుల పరిరక్షణకు..

సంస్థ ఆస్తుల పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న జీహెచ్ఎంసీ మరో ముందడుగు వేయనుంది. 8లో▸



ఆ నీటితో కార్లు కడిగితే..

వేసవిలో నీటి ఎద్దడిని నివారణకు జలమండలి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని మేయర్ విజయలక్ష్మి అన్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆదివారం	సోమవారం
సా. 6.34 గం.	ఉ. 4.55 గం.

న్యూస్‌రీల్

షాద్‌నగర్ ఆస్పత్రిలో కాయకల్ప బృందం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శనివారం కాయ కల్ప బృందం సందర్శించింది. ఈ సందర్భంగా డాక్టర్ వై.ప్రజ్ఞారెడ్డి ఆధ్వర్యంలో బృందం సభ్యులు ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. స్వచ్ఛత, బయో మెడికల్ వేస్టేజ్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, పారిశుద్ధ్య కార్మికుల రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రసవాల సంఖ్య, ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య, జరుగుతున్న అభివృద్ధి, ఆస్పత్రి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మాధవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోకిల సీఐ వీరబాబుకు సైబరాబాద్ సీపీ అభినందన



వీరబాబును అభినందిస్తున్న సీపీ అవినాశ్ మహంతి

శంకర్‌పల్లి: భార్యను రాయితో మోది హత్య చేసిన కేసును ఛేదించడంలో విశేషంగా కృషి చేసి, నిందితుడైన భర్తకు శిక్ష పడేలా చేసిన మోకిల సీఐ వీరబాబుని శనివారం సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ గజరావు భూపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఐకి నగదు ప్రోత్సాహకం అందించారు. గతేడాది ఏప్రిల్‌లో మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డి నగర్‌లో ఓ వ్యక్తి తాగిన మైకంలో భార్యతో గొడవపడి రాయితో మోది హత్య చేశాడు. మోకిల సీఐ వీరబాబు నిందితుడిని అదుపులోకి తీసుకొని, లోతుగా విచరాణ చేపట్టి చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టుకి పక్కా వివరాలు సమర్పించడంతో ఎల్‌బీనగర్ కోర్టు గత ఫిబ్రవరిలో నిందితుడికి జీవిత ఖైదు విధించింది.

26న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీలు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

కొందుర్గు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 26న అన్ని మండల కేంద్రాల్లో విజయోత్సవ ర్యాలీలు ఉంటాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ అన్నారు. కొందుర్గులో శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలపడం జరిగిందన్నారు. దీంతో మాదిగల 70 ఏళ్ల కల సాకారమైందని అన్నారు. ఈ సందర్భంగా విజయోత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేశ్, దర్శన్, రామకృష్ణ, యాదయ్య, రమేష్, యాదగిరి, రామచంద్రయ్య, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణకు సహకరించండి: సీతక్క

సైదాబాద్: డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సూచించారు. శనివారం సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణలోని అబ్జర్వేషన్ హోం పిల్లల కోసం పైలట్ ప్రాజెక్ట్‌గా సైదాబాద్‌లోని హోంలో సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రత్యేక మానసిక నిపుణుల బృందం మాదక ద్రవ్యాలకు బానిసైన పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన కౌన్సెలింగ్, వైద్య చికిత్సలు సహా అనేక సేవలను అందిస్తారని తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసైన పిల్లల కుటుంబాలకూ అవగాహన పెంచుతామన్నారు. త్వరలోనే ఇలాంటి డీ అడిక్షన్ సెంటర్లను అన్ని అబ్జర్వేషన్ హోంలలో ఏర్పాటు చేయిస్తామన్నారు.

‘అకాల’ నష్టం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది.. ఆయా మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.. పూల తోటలు దెబ్బతిన్నాయి.. మామిడికాయలు నేలరాలాయి.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లముందే పాడవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో మునిగిపోయారు.. మరోవైపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి.



కుమ్మరిగూడలో నేలరాలిన మామిడికాయలు



లింగారెడ్డిగూడలో దెబ్బతిన్న చిక్కుడు

దెబ్బ తీసిన అకాల వర్షం | నేలకొరిగిన పంటలు | ఆందోళనలో అన్నదాతలు



లింగారెడ్డిగూడలో బంతిపూల తోట ఇలా..

షాబాద్: మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. లింగారెడ్డిగూడ, దామర్లపల్లి, సాయిరెడ్డిగూడ, నాందార్‌ఖాన్‌పేట్, పెద్దవేడు, మద్దూరు, హైతాబాద్, సోలీపేట్, నాగర్‌కుంట, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో సాగు చేసిన పూల తోటలు, కూరగాయలు, వరి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన మాణెయ్య, గోపాల్‌రెడ్డి ఇంటి పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుమ్మరిగూడలో వర్షం, గాలికి మామిడి కాయలు నేలరాలిపోయాయి.



ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు

మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను అంచనా వేసి న్యాయం చేయాలని పంటలు నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

కడ్తాల్‌లో కురిసిన వడగళ్లు



కడ్తాల్: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం తేలిక పాటి వడగళ్ల వాన కురిసింది. వర్షం కారణంగా కొద్దిసేపు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఉరుములతో కూడిన వడగళ్ల వర్షానికి ఆయా కాలనీల్లో రోడ్లపై వరద నీరు నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ జనం, సాయంత్రం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు.

❖ ఈదురుగాలులతో కూడిన వర్షం

యాచారం: మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, కుర్మిద్ద గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వడగళ్లు కూడా కురిసాయి. ఈదురుగాలులతో మామిడితోటలు, కూరగాయల పంటలు, వరి పంటకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

❖ ఉరుములు, మెరుపులు, వడగళ్లు

కందుకూరు: మండల పరిధిలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన అకాల వర్షంతో నష్టం వాటిల్లింది. కొత్తూరు, కందుకూరు, కటికపల్లి, రాచులూరు, గూడూరు తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. జైత్వారంలో ఒక విద్యుత్ స్తంభం, గూడూరులో రెండు విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చాలా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని చోట్ల పశువుల కొట్టాలపై ఉన్న రేకులు లేచిపోయాయి.



కొత్తూరులో నేలరాలిన మామిడి కాయలు

నీరు లేకుంటే భవిష్యత్తు లేదు

తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సదస్సుకు హాజరైన వక్తలు

ఇబ్రహీంపట్నం రూరల్: నీరు లేకుంటే భవిష్యత్తు లేదని, మానవ మనుగడ ప్రశ్నార్థకం కానుందని తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత వ్యవసాయ ఇంజనీర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో కొంగరకలాన్‌లోని శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో శనివారం ‘తెలంగాణ జల వనరులు–నీటి యాజమాన్యం’పై సదస్సు నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలతో పాటు నీటి యాజమాన్య నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ నల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, రైతు మార్గదర్శి పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. నీటిని వృథా చేయొద్దని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీరు లేకపోతే భవిష్యత్తు లేదనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతను కాపాడాలంటే అడవులను పెంచడంతో పాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టడానికి వాటర్‌షెడ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఎమ్మెల్సీ నల్లికంటి సత్యం మాట్లాడుతూ.. సమర్థవంతమైన నీటి యాజమాన్యం కోసం రాబోయే సంవత్సరాల్లో పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అంతర్జాతీయ నీటి యాజమాన్య నిపుణుడు డాక్టర్ కె.ఎల్లారెడ్డి, జాతీయ నీటి యాజమాన్య నిపుణుడు పీఆర్‌బీ సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడం లేదని విమర్శించారు. రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. బీజేపీకి యువతే కీలకమని యువతీయువకులంతా ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, సుదర్శన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పీసరి సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య, మాజీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, జిల్లా యువ మోర్చా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు



ఆమనగల్లులోని పరీక్ష కేంద్రం వద్ద ఎంఈఓ, సీఎస్‌తో మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

ఆమనగల్లు: పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన వసతులు ఉన్నాయా లేదా అని ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఎంఈఓ పాండు, చీఫ్ సూపరింటెండెంట్‌లు శ్రీధర్, ప్రభాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో అలసత్వం తగదని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా ఉండాలని, తగినంత వెలుతురు వచ్చేలా చూడాలని సూచించారు.

సీఎస్‌పై డీఈఓ ఆగ్రహం!

ఆమనగల్లులోని బాలికల ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డిపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరీక్షల కోసం సీసీగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడిని నియమించడంపై సీఎస్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. పక్కజిల్లా నుంచి సీసీగా ఉపాధ్యాయుడిని తీసుకోవాల్సిన అవసరం ఏమిటని నిలదీసినట్లు తెలిసింది. కాగా సీసీని శుక్రవారం రోజే రిలీవ్ చేశామని సీఎస్ ప్రభాకర్‌రెడ్డి డీఈఓ సుశీందర్‌రావ్‌కు వివరించినట్లు సమాచారం.

వందశాతం పన్నుల వసూలే లక్ష్యం



రేగడిఘనాపూర్‌లో పన్ను చెల్లించిన గ్రామస్తుడికి రసీదు అందిస్తున్న డీఎల్‌పీఓ సతీష్‌కుమార్

చేవెళ్ల: ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో వందశాతం పన్నుల వసూలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు డీఎల్‌పీఓ సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆలూరు, రేగడిఘనాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో శనివారం పన్నుల వసూళ్ల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి పన్నులు సేకరించి రసీదులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో ఇప్పటి వరకు 82 శాతం పన్నులు వసూలైనట్లు తెలిపారు. ఈ నెలాఖరు వరకు వందశాతం పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని మండలాలు వందశాతం లక్ష్యాలను చేరుకోవాలని ఆయా మండలాల ఎంపీఓలు, కార్యదర్శులకు సూచించారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

పుదీనా పల్లెలో భూసేకరణ లొల్లి

- 821.11 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను తీసుకోనున్న ప్రభుత్వం
- ఆందోళనలో మొండిగౌరెల్లివాసులు
- ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అభ్యర్థన



గ్రామంలోని పట్టా భూముల్లో సాగవుతున్న పుదీనా పంట

యాచారం: పచ్చని పల్లెలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు అంశాన్ని మొండిగౌరెల్లివాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. పుదీనా, ఆకుకూరల పంటగా ఈ గ్రామానికి ప్రత్యేక పేరుంది. గ్రామంలోని దాదాపు 300 కుటుంబాలకు చెందిన రైతులు పుదీనా సాగుతో ఉపాధి పొందుతున్నారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు బస్తాల కొద్ది పుదీనాను మాదన్నపేట, సరూర్‌నగర్ రైతు బజార్ తదితర మార్కెట్లకు తరలించి విక్రయిస్తారు. యాభై ఏళ్లుగా ఇది ఆనవాయితీగా కొనసాగుతోంది. దీంతో ఈ గ్రామాన్ని పుదీనాగౌరెల్లి అని కూడా పిలుస్తున్నారు. తాజాగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఈ గ్రామాన్ని పుదీనా సాగు కోసం పైలెట్ విలేజ్‌గా ఎంపిక చేసింది.

638 మంది రైతులు

పారిశ్రామిక పార్క్‌ల ఏర్పాటు కోసమని ఈ గ్రామంలోని భూముల సేకరణకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. 638 మందికి చెందిన 821.11 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించనున్నట్లు పేర్కొంది. ఇందులో 19 సర్వేనంబరులో 375.27 ఎకరాలు, 68 సర్వేనంబరులో 188.03 ఎకరాలు, 127 సర్వే నంబరులో 113.34 ఎకరాలు కలిపి మొత్తం 498 మంది రైతులకు చెందిన 677.29 ఎకరాల అసైన్డ్ భూమితో పాటు సర్వే నంబరు 69 నుంచి 82 వరకు ఉన్న 140 మంది రైతులకు చెందిన 143.82 ఎకరాల పట్టా భూములను తీసుకోవడానికి సర్కార్ నిర్ణయించింది. నోటిఫికేషన్ ప్రకటనలో పారిశ్రామిక పార్క్‌ల కోసమని ఉంది కానీ ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో స్పష్టంచేయలేదు.

ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరితే..

యాచారం మండల కేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామాన్ని ఫ్యూచర్ సిటీ యూడీఏలో కలపాలని స్థానికులు కోరారు. ఈ మేరకు పలుమార్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డికి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాలు అందించారు. కానీ సాగు చేసుకు బతుకుతున్న భూములను తీసుకునేందుకు వచ్చిన ప్రకటనతో బోరున విలపిస్తున్నారు. అసైన్డ్ సర్వే నంబర్లు 19, 68, 127తో పలు పట్టా సర్వేనంబర్ల భూములపై తరచూ డ్రోన్లు సంచరిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే భూములను తీసుకుంటే తమ గతి ఏమిటని వాపోతున్నారు. భూ సేకరణకు వ్యతిరేకంగా బాధితేలే పోరాటానికి సిద్ధమవుతున్నారు.



భూసేకరణ నోటిఫికేషన్ వేసిన మొండిగౌరెల్లి గ్రామం

ఉన్నత చదువులు చదివి..



ఉన్నత చదువులు చదివినా వ్యవసాయంపై మక్కువతో పుదీనా సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నాం. డ్రోన్ల సంచారంతో పట్టా భూములు సైతం తీసుకుంటారేమోనని ఆందోళనగా ఉంది. గ్రామంలో భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలి.

– కుంచారాపు సందీప్‌రెడ్డి, మొండిగౌరెల్లి

స్పష్టత లేదు



మొండిగౌరెల్లిలో పారిశ్రామిక పార్క్‌ల కోసం 822 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ వేశాం. కాని ఏఏ కంపెనీలకు భూములు అప్పగిస్తారనేది ప్రభుత్వం నుంచి మాకు స్పష్టత లేదు. భూసేకరణ విషయమై రైతుల ఇచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

యాచారం: పశువుల మేత విషయంలో ఇద్దరి మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో దాడి చేసిన వ్యక్తికి ఇబ్రహీంపట్నం న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ముచ్చర్ల గ్రామంలో పశువుల మేత విషయంలో ఈ నెల 12న అదే గ్రామానికి చెందిన ఎర్ర మల్లయ్య, ఎదిరే కృష్ణయ్య మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో ఎర్ర మల్లయ్య తన చేతిలో ఉన్న గొడ్డలికామతో ఎదిరే కృష్ణయ్యను కొట్టగా అతనికి తీవ్ర గాయమైంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టుకు నివేదిక సమర్పించారు. ఇబ్రహీంపట్నం న్యాయస్థానం శనివారం ఎర్ర మల్లయ్యకు 14 రోజుల రిమాండ్ విధించింది.



ఆస్తుల పరిరక్షణకు.. డీజీపీ‘ఎస్’

ఈ సర్వేతో అంగుళం స్థలం కూడా కబ్జా కాదు



- పార్కులు, లే ఔట్లు, ఇతర స్థలాలకు రక్షణ
- టెక్నాలజీ వినియోగంలో జీహెచ్ఎంసీ మరో అడుగు

సాక్షి, సిటీబ్యూరో: సంస్థ ఆస్తుల పరిరక్షణ, అక్రమాల కట్టడికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న జీహెచ్ఎంసీ మరో ముందడుగు వేయనుంది. జీహెచ్ఎంసీకి సంబంధించి ఎన్నో ఆస్తులున్నాయి. వాటిపై తగిన శ్రద్ధ, పర్యవేక్షణ లేకపోవడంతో కమ్యూనిటీ హాళ్ల నుంచి పార్కుల దాకా ఇప్పటికే ఎన్నో కబ్జాలు జరి గాయి. పలు ఆస్తులు ఆక్రమణదారుల పరమయ్యాయి. వీటితో పాటు లే ఔట్లలోని ప్రభుత్వ స్థలాలు తదితరాలు సైతం బడాబాబులకు కాసులు కురిపించే కల్పతరువులయ్యాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని కార్పొరేషన్ ఆస్తులతోపాటు ప్రభుత్వ ఆస్తులు కూడా పరిరక్షించేందుకు, కబ్జాల పాలు కాకుండా ఉండేందుకు మరో ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. అదే డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్) సర్వే.

జీపీఎస్ కన్నా ఉత్తమం..

జీపీఎస్ గురించి అందరికీ తెలిసిందే. దానికంటే ఉన్నతమైనది డీజీపీఎస్. ఈ సర్వేతో ఆయా ఆస్తులు, స్థలాల సర్వే, మ్యాపింగ్ తదితర అంశాల్లో అంగుళం వరకు కచ్చితత్వం ఉంటుంది. ఇందులో రెండు జీపీఎస్ రిసీవర్లను వినియోగిస్తారు. నిర్దిష్ట ప్రదేశానికి సంబంధించి జీపీఎస్ సిగ్నల్స్‌కు, ఉపగ్రహం సూచించిన ప్రదేశానికిమధ్య ఉండే ఎర్రర్స్ ఫీల్డ్‌లోని మొబైల్ (రోవర్) డీజీపీఎస్ రిసీవర్లకు ట్రాన్స్‌మిట్ అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ విధానం వల్ల అంగుళం వరకు కచ్చితత్వం ఉంటుందని తెలిపారు. జీపీఎస్‌లో 10 నుంచి 15 మీటర్ల వరకు వ్యత్యా సముంటుందన్నారు. డీజీపీఎస్‌తో అంగుళం స్థలం కూడా తేడా రాకుండా కచ్చితంగా తెలుస్తుందన్నారు. డీజీపీఎస్ సర్వేతో పార్కులు సహా జీహెచ్ఎంసీ ఆస్తులన్నింటినీ, ఆయా లే ఔట్లలోని ప్రభుత్వ స్థలాల్ని, మ్యాపింగ్ చేయనున్నారు.

ప్రయోగాత్మకంగా ఒక జోన్‌లో..

డీజీపీఎస్ సర్వేను తొలుత ఒక జోన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టి, అనంతరం అన్ని జోన్లలోనూ నిర్వహించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. ఇప్పటికే పరుల పాలైన జీహెచ్ఎంసీకి చెందిన ఆస్తులు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు తదితరమైన వాటిని కూడా గుర్తించి పరిరక్షించాలనేది కార్పొరేషన్ లక్ష్యం. నగరంలో భూముల విలువ కోట్లలో ఉండటంతో అంగుళం స్థలం కూడా పోనివ్వకుండా ఉండేందుకు ఈ సర్వేకు సిద్ధమవుతున్నారు.

విద్యుత్ స్తంభాలకు సైతం ఐడీలు

ప్రతి రోడ్డుకూ ఒక ప్రత్యేక ఐడీ ఇవ్వాలని భావించిన జీహెచ్ఎంసీ అధికారులు ప్రజల నుంచి వెవెల్లువెత్తుతున్న విమర్శలతో విద్యుత్ విభాగంలోనూ ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అన్ని విద్యుత్ స్తంభాలు, కనెక్షన్లు, వినియోగిస్తున్న విద్యుత్ తదితరమైనవి పక్కాగా లెక్క తెలిసేలా స్తంభాలకు ఐడీలు, క్యూఆర్ కోడ్‌లు, పర్యవేక్షణకు యాప్స్ వంటివి వినియోగించనున్నారు. రోడ్ల చరిత్ర మాదిరే ఐడీతో స్తంభం ఏర్పాటు నుంచి దానికి అమర్చిన బల్బులు.. ఎంత కాలం పనిచేశాయి.. కొత్తవి ఎప్పుడు వేశారు? తదితర వివరాలన్నీ తెలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీపై ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శల్లో అక్రమాలకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ విభాగం అగ్ర స్థానంలో ఉండగా, నిర్వహణ లేమిలో విద్యుత్ విభాగం ఉంది. చీకట్లో మగ్గుతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా నిర్వహణలేమి, అక్రమాలతో పరిష్కారం కావడం లేదు. చేయబోయే పనులతో వాటికి తెర పడుతుందని భావిస్తున్నారు.

అక్రమార్కుల నుంచి రక్షించండి

కరన్‌కోట్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

తాండూరు రూరల్: ఇసుక అక్రమార్కుల తనకు ప్రాణహాని ఉందని మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లికి చెందిన ఫిరంగి జర్నప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు గ్రామస్తులతో కలిసి శనివారం మరోసారి కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాలాల మండలం అగ్గనూర్‌కు చెందిన మాజీ సర్పంచు భీమప్ప అనుచరులు 20 మంది తనపై అకారణంగా దాడి చేశారన్నారు. గత శుక్రవారం అర్ధరాత్రి వీర్‌శెట్టిపల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా 100 నంబర్‌తో పాటు కరన్‌కోట్ పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు. అయితే మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ భీమప్ప అనుచరులు అర్ధరాత్రి వీర్‌శెట్టిపల్లికి వచ్చి వీరంగం సృష్టించారన్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు పంచాయతీ కార్యాలయం సీసీ కెమెరాల్లో నమోదయ్యాయని, వీటిని బయట పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన భీమప్ప అనుచరులు తనను పీఎస్‌లో మరోసారి బెదిరించారన్నారు. ఈ విషయమై డీఎస్పీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. అధికార పార్టీ కార్యకర్తనైన తన పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల సంగతి ఏమిటని ప్రశ్నించారు. ఇసుక అక్రమార్కులకు పోలీసులు కొమ్ము కాస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. జర్నప్పపై దాడి విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

జలమండలి నీటితో కార్లు కడిగితే
రూ.10 వేలు జరిమానా వేయండి



మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఎండాకాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు జలమండలి అధికారులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని, నగరవాసులు కూడా వారికి సహకరించాల్సిన అవసరం ఉందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ అసోసియేషన్ కార్యాలయంలో మేయర్ జలమండలి, జీహెచ్ఎంసీ, కాలనీ వాసులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జలమండలి నీటితో కొంతమంది నిత్యం తమ కార్లు, ఇంటి ముందున్న బండలు, రోడ్లు కడుగుతున్నారని, వారికి నీటి విలువ తెలియడం లేదన్నారు. అలా ఇష్టారాజ్యంగా కార్లు కడుగుతున్న వారికి రూ.10 వేల జరిమానా విధించాలంటూ జలమండలి అధికారులను ఆమె ఆదేశించారు. అదే విధంగా ఎమ్మెల్యే కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కో- ఆపరేటివ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీ అధ్యక్షుడు టి. నారాయణరెడ్డి, జలమండలి జీఎం హరిశంకర్, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బైక్‌ను ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



బాల్‌రాజ్ (ఫైల్)



హరిబాబు (ఫైల్)



గాయాలతో పడి ఉన్న బాల్‌రాజ్, హరిబాబు

షాబాద్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని సంకెపల్లిగూడ పంచాయతీకి అనుబంధ గ్రామమైన శేరిగూడకు చెందిన చీమల బాల్‌రాజ్ (40), హరిబాబు (42) కలిసి శనివారం మధ్యాహ్నం కూలి పనికోసం బాల్‌రాజ్ బైక్‌పై నాగర్‌గూడకు వెళ్తున్నారు. మల్లారెడ్డిగూడ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్ బలంగా ఢీ కొట్టింది. దీంతో బాల్‌రాజ్, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాల్‌రాజ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హరిబాబును ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాల్‌రాజ్‌కు భార్య హంసమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. హరిబాబు 25 ఏళ్ల క్రితం ఒంగోలు జిల్లా టంగుటూరు నుంచి వలస వచ్చారు. మూడేళ్ల క్రితం హరిబాబు భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాల్‌రాజ్ భార్య హంసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తిని, రోడ్డు మధ్యలో డివైడర్ తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ మాజీ సర్పంచ్‌లు చందిప్ప జంగయ్య, కుమ్మరి దర్శన్, బీజేపీ మండల అధ్యక్షులు మద్దూరు మాణెయ్య డిమాండ్ చేశారు.

డ్రైవర్‌ను బెదిరించి ఆటో తీసుకెళ్లిన ముగ్గురి అరెస్టు

- ర్యాపిడోలో బుక్ చేసుకుని...
- మార్గ మధ్యలో ఆటోతో పరార్



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

శంషాబాద్ రూరల్: ర్యాపిడో ఆటోను బుక్ చేసుకున్న ముగ్గురు వ్యక్తులు.. హైదరాబాద్ నుంచి మండల శివారు ప్రాంతానికి వచ్చిన తర్వాత.. డ్రైవర్‌ను బెదిరించి ఆటోను దొంగిలించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఉప్పల్‌లోని మేడిపల్లి ప్రాంతానికి చెందిన బ్రహ్మయాదవ్ ర్యాపిడో ద్వారా ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 13న ముగ్గురు వ్యక్తులు ఇతని ర్యాపిడో రైడ్‌లో బుక్ చేసుకున్నారు. ఉప్పల్ నుంచి మండలంలోని రాయన్నగూడ వద్దకు రాగా.. రాత్రి 10 గంటల సమయంలో బహిర్భూమి కోసం ఆటోను ఆపారు. తర్వాత డ్రైవర్ బ్రహ్మయాదవ్‌ను బెదిరించి ఆటోతో పరారయ్యారు.

జైలుకు వెళ్లివచ్చినా మారని బుద్ధి

హైదరాబాద్‌లోని బండ్లగూడ ప్రాంతంలోని మహమ్మద్ నగర్ వాసి మహ్మద్ రషీద్(26) ఆటో డ్రైవర్‌గా, బాలాపూర్ పరిధిలోని షాహిన్‌నగర్‌కు చెందిన షేక్ హసనుద్దీన్(22) డెకరేషన్ పని, మహ్మద్ ఆరిఫ్(25) ప్లంబర్‌గా పని చేస్తున్నారు. వీరు ర్యాపిడో రైడ్‌లో ఆటోను బుక్ చేసుకున్నారు. మార్గ మధ్యలో డ్రైవర్‌ను బెదిరించి ఆటోను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరు గతంలో దొంగతనం, చైన్ స్నాచింగ్ కేసుల్లో జైలుకి వెళ్లారు. అయినా వారి ప్రవర్తన మార్చుకోలేదు. వీరి నుంచి పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు.

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

- సికింద్రాబాద్ వాసి నుంచి రూ.1.22 కోట్లు స్వాహా
- సూత్రధారులకు ఖాతాలు ఇచ్చిన యూపీ నివాసి
- అరెస్టు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: టెలిగ్రామ్ ద్వారా వల వేసి, ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఎర వేసి, సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.1.22 కోట్లు కాజేసిన కేసులో ఓ నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారులకు అవసరమైన బ్యాంకు ఖాతాలను అందించిన అంకిత్ అరోరాను ఉత్తరప్రదేశ్‌లో పట్టుకున్నట్లు డీసీపీ దార కవిత శనివారం తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుడిని గత ఏడాది టెలిగ్రాం యాప్ ద్వారా సంప్రదించారు. ఇతడిని ఓ గ్రూపులో చేర్చిన కేటుగాళ్లు తొలినాళ్లల్లో ట్రేడింగ్‌కు అవసరమైన టిప్స్ ఇచ్చారు. కొన్నాళ్లకు తాము అందించే ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పి ఆ లింకు పంపారు. దాని ద్వారా ట్రేడి ంగ్ పేరుతో డబ్బు బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.1,22,87,120 బదిలీ చేసిన తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్‌రావు బృందం ఈ కేసు దర్యాప్తు చేసింది. బాధితుడి నగదు బదిలీ అయిన బ్యాంకు ఖాతాల ఆధారంగా ముందుకు వెళ్లిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకిత్ అగర్వాల్‌కు చెందినవిగా గుర్తించారు. ఇతగాడు సూత్రధారుల ఆదేశాల మేరకు కమీషన్ తీసుకుంటూ పని చేస్తూ, వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు అందిస్తుంటాడు. ఇలా దాదాపు రూ.6 కోట్లు ఇతడి బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లకు చేరాయి. అంకిత్‌ను అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి కోసం లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేస్తున్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయండి

ఫిలింనగర్: ముస్లిం మైనార్టీ మహిళపై దాడి చేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని తెలంగాణ మైనార్టీ కమిషన్ బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించింది. వివరాలివీ.. ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో నివసించే చినాజ్‌బేగంను 2019 నవంబర్ 13న స్థానికంగా నివసించే కొంతమంది కొట్టారు. దీంతో ఆమె తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా తెలంగాణ మైనార్టీ కమిషన్‌ను ఆశ్రయించింది. కమిషన్ బంజారాహిల్స్ పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తూ చినాజ్‌బేగంపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సూచించింది. ఈ అభ్యర్థనను పోలీసులు పట్టించుకోకపోవడంతో గత ఫిబ్రవరి 11న బాధిత మహిళ మరోసారి కమిషన్‌ను ఆశ్రయించింది. తాము ఇప్పటికే నాలుగుసార్లు కేసు నమోదు చేయాలంటూ సూచించామని, ఇది ఐదోసారని, ఈసారి ఎట్టిపరిస్థితులో సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలంటూ మరోసారి కమిషన్ పోలీసులను కోరింది.